వ్యవసాయానికి 'ఉపాధి'ని అనుసంధానించండి

పుట్టపర్తి టౌన్: వ్యవసాయానికి ఉపాధి హామీ పథకం అనుసంధానించి, కూలీల వలసలు ఆపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని సాయిఆరామంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షులు బాలస్వామి అధ్యక్షతన జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వేమయ్య యాదవ్ మాట్లాడుతూ ఉపాధి హామీ రాష్ట్ర మానిటరింగ్‌కమిటీ ఏర్పాటు చేసి అందులో వ్యవసాయ కార్మికసంఘాల ప్రతినిధులను చేర్చాలన్నారు. ఉపాధి పనుల సమయంలో ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కేశవరెడ్డి, నియోజవర్గ కార్యదర్శి అంజినేయులు, గౌరవాధ్యక్షులు కుళ్లాయప్ప, జిల్లా కార్యదర్శి కదిరెప్ప,రమణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు కొండయ్య, శివమ్మ,గంగాద్రి, ఇందిరాబాయి, కళావతి, విమల చౌడప్ప, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కదిరి టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడి బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కుటాగుళ్లకు చెందిన బీటెక్ విద్యార్థి మొయిన్‌ఖాన్ వైద్యానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేఎస్ షాన్‌వాజ్ రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు.

● వనభోజనాల సందడి


పోట్లమర్రిలో వన భోజనాలు చేస్తున్న ఓ కుటుంబం


ఊయలూగుతున్న యువతులు

బత్తలపల్లి: శ్రీరామ నవమి పండుగ అనంతరం గ్రామాల్లో వనభోజనాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా మండలంలోని గుమ్మల్లకుంట, పోట్లమర్రి, రాఘవంపల్లి, సంజీవపురం, అనంతసాగరం గ్రామాల్లో సందడి నెలకొంది. ఆయా గ్రామాల్లో ఉదయమే ఇళ్లకు తాళాలు వేసి అందరూ వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి చెట్ల కిందనే రోజంతా గడిపారు. బావుల వద్ద పూజలు నిర్వహించారు. అక్కడే వంటలు చేసుకుని ఆరగించారు. బంధువులు, స్నేహితులతో కలిసి కాలక్షేపం చేశారు. ఆటలు ఆడుతూ, ఊయలలూగుతూ కేరింతలు కొట్టారు. టెంకాయలు, చీనీ కాయలు విసురుతూ పందేలు ఆడారు. సాయంత్రం అందరూ గ్రామంలో ఏర్పాటు చేసిన తోరణం కింద నుంచి ఇళ్లకు చేరుకున్నారు. గ్రామాల్లోని దేవుళ్లకు నారికేళాలు సమర్పించారు. ఇలా చేయడం వల్ల మంచి జరుగుతుందని గ్రామస్తుల నమ్మకం.

ప్రజల ఆరోగ్య రక్షణే లక్ష్యం

పుట్టపర్తి అర్బన్: ప్రజల ఆరోగ్య పరిరక్షణే వైద్య ఆరోగ్య శాఖ లక్ష్యమని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజాబేగం పేర్కొన్నారు. ప్రజలకు ఆరోగ్య రక్షణపై అవగాహన పెంపొందించడానికి ఏప్రిల్ ఏడో తేదీన ప్రపంచ ఆరోగ్య దినోత్సవంగా నిర్వహించుకుంటున్నట్లు చెప్పారు. సోమవారం పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి గణేష్ సర్కిల్ వరకు అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, విద్యార్థులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డితో కలిసి డీఎంహెచ్‌ఓ ఫైరోజాబేగం మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం బాగుంటుందన్నారు. మంచి ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ తిప్పేంద్ర నాయక్, ఆర్‌బీఎస్‌కే జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ నివేదిత, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ మునిచంద్రిక, సీడీపీఓ గాయత్రి, సూపర్‌వైజర్ భారతి, జిల్లా టీబీ అధికారి డాక్టర్ తిప్పయ్య, సీహెచ్‌ఓ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్: దర్శనమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా డాక్టర్ పుష్పలత ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజశేఖర్ రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


పుట్టపర్తిలో మానవహారంగా ఏర్పడిన దృశ్యం

ముదిగుబ్బ: మండల పరిధిలోని ఎనుమలవారిపల్లి, మలకవేములలో సోమవారం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ వేణుగోపాల్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాణి, ఎంపీహెచ్‌ఏ క్రిష్ణవేణి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పర్యటనకు తరలిరండి

ముదిగుబ్బ: రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో ముదిగుబ్బ నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని మండల కన్వీనర్ సీవీ నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

వైఎస్ జగన్ పర్యటన విజయవంతం చేద్దాం

చెన్నేకొత్తపల్లి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి గ్రామానికి విచ్చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి చెన్నేకొత్తపల్లి మండలం నుంచి పార్టీ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని పార్టీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి సోమవారం పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఉదయం 9 గంటలకు నాయకులు, కార్యకర్తలు కుంటిమద్దికి చేరుకోవాలన్నారు. అక్కడి నుంచి పాపిరెడ్డిపల్లికి ర్యాలీగా వెళ్దామని తెలిపారు.

కనగానపల్లి: రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో టీడీపీ నాయకుల చేతిలో హత్యకు గురైన కురుబ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు వస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను జయప్రదం చేద్దామని ఆ పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గంగుల సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రం కనగానపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాప్తాడు నియోజకవర్గంలో ఫ్యాక్షన్ రాజకీయాలను అంతమొందించాలనే యువతి, యువకులు, ప్రజాస్వామ్యవాదులు, పార్టీ నాయకులు ఈ కార్యక్రమానికి స్వచ్ఛందంగా తరలిరావాలన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రతి ఒక్కరూ రామగిరి మండలం కుంటిమద్ది గ్రామ సమీపానికి చేరుకోవాలన్నారు.

టీబీ చర్మ పరీక్షలు

ధర్మవరం అర్బన్: క్షయ రోగితో పాటు నివసించే వ్యక్తులకు టీబీ చర్మ పరీక్షలు చేస్తున్నామని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఎం.తిప్పయ్య తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సోమవారం సీవై టీబీ చర్మ పరీక్షలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధి సంక్రమణ పరీక్ష, క్షయ సోకిన రోగితోపాటు నివసించే వ్యక్తులకు చేసే పరీక్షలకు ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ ప్రశాంత్, వైద్యురాలు ప్రియాంక, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, టీబీ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.


చర్మ పరీక్షలు చేస్తున్న వైద్యులు

సంక్షిప్త సమాచారం

సచివాలయ ఉద్యోగులపై ఆగ్రహం

పుట్టపర్తి టౌన్: ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి సోమవారం పుట్టపర్తిలో సుడిగాలి పర్యటన చేశారు. ఎనుములపల్లి సచివాయం ఉదయం 10 గంటలైనా తలుపులు తెరవక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కాసేపటికి సిబ్బంది కార్యాలయానికి చేరుకున్నారు. అటెండెన్స్ సరిగా లేకపోవడంతో సిబ్బందికి మెమోలు జారీ చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రహల్లాదను ఆదేశించారు. అనంతరం బీడుపల్లి, ఎనుములపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. అటు నుంచి ఆర్టీసీ డిపో వద్ద రూ.7లక్షల నిధులతో ప్లాట్‌ఫామ్ నిర్మాణ పనులకు భూమి పూజచేశారు. అనంతరం 6, 7 వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

మొబైల్ ఆరోగ్య శిబిరం

బత్తలపల్లి: మండల కేంద్రం బత్తలపల్లిలోని బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం మొబైల్ ఆరోగ్య శిబిరాన్ని ఎంపీ బీకే పార్థసారథి ప్రారంభించారు. శిబిరంలో వైద్య నిపుణుల పర్యవేక్షణలో ఉచిత వైద్య పరీక్షలు ఓపీడీ ఎక్స్‌రే సేవలు, ల్యాబొరేటరీ పరీక్షలు, సాధారణ కంటి స్క్రీనింగ్, ముక్కు, నాడీ, ఎన్సీడీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, మెడికల్ కోఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

కదిరి టౌన్: పార్నపల్లి చిత్రావతి రిజర్వాయర్ నుంచి వచ్చే తాగునీటి సరఫరాకు 10 రోజులపాటు అంతరాయం ఉంటుందని కదిరి మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దొరిగల్లు పంప్‌హౌస్ వద్ద గల రెండు మోటర్లలో ఒకటి చెడిపోయిందని, దాని రిపేరీకి 10 రోజులు సమయం పడుతుందని పేర్కొన్నారు.

ఉన్నత పాఠశాలగా మార్చాలని వినతి

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువులోని పాత ఆంధ్రా బ్యాంక్ వెనుక ఉన్న కేపీ రావ్ అప్పర్ ప్రైమరీ ఉర్దూ పాఠశాలను ఉన్నత పాఠశాలగా మార్చాలని దర్గా కమిటీ మాజీ చైర్మన్ అతావూర్ రహిమాన్, ఎంపీటీసీ రఫీ, వార్డు మెంబర్ వాజిజ్, విద్యార్థుల తల్లిదండ్రులు డీఈఓ క్రిష్ణప్పను కోరారు. ఈ మేరకు సోమవారం డీఈఓ కార్యాలయంలో డీఈఓకు వినతిపత్రం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన లింగరాజు సోమవారం రాత్రి కదిరి గేటు వైపు నుంచి ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా వెనుక నుంచి వచ్చిన బొలెరో వాహనం మున్సిపల్ ఆఫీస్ సమీపంలో ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో లింగరాజు తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించారు.

బలకవారిపల్లిలో అమ్మవారి ఊరేగింపు

అమడగూరు: మండల కేంద్రంలో చౌడేశ్వరీ అమ్మవారి ఉత్సవాలను పురస్కరించుకుని 16 గ్రామాల ఊరేగింపు కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం బలకవారిపల్లిలో గ్రామస్తులు అమ్మవారి విగ్రహ ప్రతిమను పల్లకీలో ఊరేగించారు. కోర్కెలు తీరిన వారంతా అమ్మవారికి వడివేలును సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామ నడిబొడ్డున అమ్మవారిని కొలువుదీర్చి భక్తులకు ప్రసాదాన్ని పంచిపెట్టారు. ఊరేగింపు తర్వాత అమ్మవారిని శీతిరెడ్డిపల్లికి చేర్చారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చండి

ముదిగుబ్బ: వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చి కూటమి ప్రభుత్వం హామీ నెరవేర్చుకోవాలని వాల్మీకి సంఘం అధ్యక్షుడు కనుమ ప్రభాకర్ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

26 నుంచి రాజకీయ శిక్షణ తరగతులు

పుట్టపర్తి టౌన్: కడపలో ఈ నెల 26 నుంచి మూడు రోజుల పాటు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. శిక్షణ తరగతుల కరపత్రాలను సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ సోమవారం పుట్టపర్తిలోని పార్టీ కార్యాలయంలో విడుదల చేశారు.

టిప్పర్ బోల్తా

నల్లచెరువు: టిప్పర్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. సోమవారం మద్దిమడుగు సమీపంలోని కంకర ఫ్యాక్టరీ నుంచి కదిరి వైపు కంకర లోడ్ తో వెళ్తున్న టిప్పర్ వాహనం పాత స్టేషన్ సమీపంలోకి రాగానే ఒక్కసారిగా అదుపుతప్పి జాతీయ రహదారిపై బోల్తా పడింది. టిప్పర్ డ్రైవర్ సతీష్, క్లీనర్ విఘ్నేశ్వరసింగ్‌కు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వారిద్దరినీ కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

దోబీఘాట్ ఏర్పాటు చేయండి

కదిరి టౌన్: కుటాగుళ్లలో దోబీఘాట్ ఏర్పాటు చేయాలని రజక సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పూర్వం నుంచి కుటాగుళ్లలో దాదాపు 20 కుటుంబాలు రజకవృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయన్నారు. అధికారులు స్పందించి గ్రామం సమీపంలో దోబీఘాట్, కమ్యూనిటీ హాలు నిర్మాణానికి స్థలం కేటాయించాలని వారు కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పన్నీటి కాశయ్య, ఉపాధ్యక్షుడు బాపనపల్లి శివప్ప, రాష్ట్ర కార్యదర్శి క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

జీవనోపాధి కార్యాచరణపై శిక్షణ

ఓడీచెరువు : పల్లవి మండల సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా సంఘంలో చదువుకున్న సభ్యులకు, ఎన్యుమరేటర్లకు, వీఓఏలకు జీవనోపాధి కార్యాచరణ ప్రణాళిక తయారీ కోసం సోమవారం ఒక్క రోజు శిక్షణ నిర్వహించారు. ఓడీచెరువు ఏరియా కో ఆర్డినేటర్ రవీంద్ర, సీసీ మునెప్ప పాల్గొన్నారు

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

అమడగూరు: శీతిరెడ్డిపల్లి సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ ప్రభాకర్ తెలిపారు. ఇందులో భాగంగానే సోమవారం కళాశాల అధ్యాపకులు అమడగూరు, చీకిరేవులపల్లి, గంగిరెడ్డిపల్లి, శీతిరెడ్డిపల్లి, రెడ్డివారిపల్లి గ్రామాల్లో ఇటీవల పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల ఇళ్లను సందర్శించారు.

మహిళ మెడలో చైన్ అపహరణ

కదిరి టౌన్: రాత్రిపూట వాకింగ్ చేస్తున్న మహిళ మెడలోని బంగారు చైన్‌ను దుండగులు అపహరించుకుపోయారు. పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీలో ట్రాన్స్‌కో లైన్‌మెన్ ప్రసాద్, టీచర్ రాధారాణెమ్మ దంపతులు కూతురుతో కలిసి సోమవారం రాత్రి వాకింగ్ చేస్తున్నారు. ఇదే సమయంలో ఇద్దరు దుండగులు ద్విచక్రవాహనంపై వచ్చి రాధారాణెమ్మ మెడలోని మూడున్నర తులాల బంగారు చైన్‌ను లాక్కుని ఉడాయించారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



ధర్మవరం అర్బన్: కటారుపల్లి యోగివేమన ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో ఆదివారం రాత్రి ధర్మవరం శ్రీలలిత నాట్య కళానికేతన్ గురువులు బాబు బాలాజీ, కమల బాలాజీ, రామ లాలిత్యల శిష్య బృందం నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. 15 మంది శిష్య బృందంతో భరత నాట్యం, కూచిపూడి, రామ రసామృతం నృత్య రూపకం ప్రదర్శించారు. ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, ఆర్గనైజర్ వేమారెడ్డిల చేతులమీదుగా గురువులను సన్మానించడంతోపాటు నాట్య కళాకారులకు మెమెంటోలు అందించారని గురువు బాబు బాలాజీ తెలిపారు.

కటారుపల్లి.. భక్తులు ప్రణమిల్లి

- వేమన ఉత్సవాలతో నూతన శోభ
- అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- వివిధ ప్రాంతాల నుంచి పోటెత్తుతున్న భక్తులు

గాండ్లపెంట: విశ్వకవి యోగి వేమన ఉత్సవాలు కటారుపల్లిలో అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. వేమన సమాధి, ఆలయ పరిసరాలను మిరుమిట్లు గొలిపే లైటింగ్‌తో అలంకరించడంతో గ్రామం నూతన శోభ సంతరించుకుంది. నాలుగు రోజులపాటు సాగే ఉత్సవాలను తిలకించేందుకు కదిరి పరిసర మండలాల నుంచే కాక ఉమ్మడి కర్నూలు, పొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, వైఎస్సార్ జిల్లాలతో పాటు కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తుతున్నారు. ఆలయ పరిసరాలు బొమ్మలు, మిఠాయి దుకాణాలు, టెంకాయలు, పూల అంగళ్లతో కిటకిటలాడుతున్నాయి. తొలిరోజు ఆదివారం మహాశక్తిపూజ (కుంభం పోయుట), మధ్యాహ్నం నుంచి రాత్రి 1 గంట వరకు శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. రెండో రోజు సోమవారం రాత్రి బండ్ల మెరవణి, పానక పన్నేరం, పాటల కచేరీ (ఆర్కెస్ట్రా) ఉత్సాహంగా సాగాయి. ఉత్సవాల్లో మూడో రోజు మంగళవారం సాయంత్రం ఉట్ల తిరునాల, రాత్రి అగ్ని సేవ ఉంటాయి. బుధవారం రాత్రి గొడుగుల మెరవణితో ఉత్సవాలు ముగుస్తాయి.


మొక్కులు తీర్చుకునేందుకు ఏర్పాటు చేసిన చాందినీ బండి


వేమన ఉత్సవాల్లో సాంస్కృతిక ప్రదర్శనలు

వేమనకు ప్రత్యేక పూజలు

గాండ్లపెంట: కటారుపల్లిలో విశ్వకవి యోగి వేమన ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. సోమవారం రాత్రి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి. ప్రణీత్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి వేమన సమాధిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులు, దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కృష్ణారెడ్డి, ఉత్తన్న, రామకృష్ణ, క్రాస్ రవికుమార్, మహిధర్‌రెడ్డి, లక్ష్మీదేవమ్మ, చాంద్‌బాషా, ఆసిఫ్, మండల కన్వీనర్ గజ్జలరవీంద్రారెడ్డి, ఎంపీపీ గంగోజమ్మ, ఎంపీటీసీ జగన్‌మోహన్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ, బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి జక్కల లక్ష్మీనరసింహాగౌడ్, పామిడి ఇక్బాల్, మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్‌రవూఫ్, మాజీ డైరెక్టర్ మేకల నరసింహులు, అజీం, సర్పంచ్‌లు నాగభూషణంరెడ్డి, ఆంజనేయులు, మైనుద్దీన్, వేమనాథ్ తదితరులు పాల్గొన్నారు.


వేమన సమాధి వద్ద ప్రత్యేక పూజలు చేయిస్తున్న నాయకులు